క్లుప్తంగా

హోం పోలింగ్‌పై అవగాహన



మాట్లాడుతున్న తహసీల్దార్ వెంకట రెడ్డి

దుబ్బాక: పార్లమెంట్ ఎన్నికల్లో హోం పోలింగ్ విధానంపై ఎంపీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులకు మంగళవారం దుబ్బాక ఐఓసీ కార్యాలయంలో ఏఆర్ఓ, తహసీల్దార్ వెంకట్ రెడ్డి అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మే 2, 3వ తేదీలలో హోం పోలింగ్ నిర్వహిస్తున్నామన్నారు. ఎంపీ ఎన్నికల్లో పోటీ చేస్తున్న అభ్యర్థులు హోం పోలింగ్ విధానాన్ని పరిశీలించడానికి పోలింగ్ ఏజెంట్‌లను నియమించుకోవాలని సూచించారు. అలాగే మే 3వ తేది నుంచి 8వ తేదీ వరకు దుబ్బాక ఐఓసీ కార్యాలయంలో జరిగే పోస్టల్ బ్యాలెట్ విధానాన్ని పోలింగ్ ఏజెంట్‌లు పరిశీలించవచ్చన్నారు. కార్యక్రమంలో ఎంపీ అభ్యర్థులు, వివిధ పార్టీల ప్రతినిధులు, తదితరులు పాల్గొన్నారు.

బీజేపీని ఓడించండి



కరపత్రం ఆవిష్కరిస్తున్న సీఐటీయూ జిల్లా కోశాధికారి భాస్కర్

దుబ్బాకటౌన్: బీజేపీ కేంద్ర ప్రభుత్వం ప్రజలను, కార్మిక వర్గాన్ని మోసం చేసిందని సీఐటీయూ జిల్లా కోశాధికారి గొడ్డుబర్ల భాస్కర్ విమర్శించారు. మంగళవారం ఇండియా కూటమి అభ్యర్థులను గెలిపించాలని కోరుతూ దుబ్బాకలో కరపత్రం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ బీజేపీ ప్రభుత్వం కార్పొరేట్ ప్రయోజనాల కోసం 29 కార్మిక చట్టాలను రద్దు చేసి, కార్మిక వ్యతిరేక లేబర్ కోడ్‌లను తెచ్చిందన్నారు. ప్రభుత్వ ఉద్యోగులకు నూతన పెన్షన్ విధానం తెచ్చి మోసం చేస్తోందన్నారు. పార్లమెంట్ ఎన్నికల్లో ఇండియా కూటమి అభ్యర్థులకు ఓటు వేసి గెలిపించాలని కోరారు. కార్యక్రమంలో సీఐటీయూ నాయకులు కొంపల్లి భాస్కర్, రాజిరెడ్డి, రాములు, స్వామి, తదితరులున్నారు.

దుబ్బాక ఎమ్మెల్యే తీరు మార్చుకోవాలి



మాట్లాడుతున్న ఎంపీపీ సాయిలు

మిరుదొడ్డి(దుబ్బాక): దుబ్బాక అభివృద్ధికి అడ్డంకిగా మారిన దుబ్బాక ఎమ్మెల్యే కొత్త ప్రభాకర్‌రెడ్డి తన తీరు మార్చుకోవాలని ఎంపీపీ గజ్జెల సాయిలు, పీఏసీఎస్ చైర్మన్ లింగాల రాజలింగారెడ్డి అన్నారు. మంగళవారం మిరుదొడ్డిలో వారు మాట్లాడుతూ ప్రజాప్రతినిధులకు విలువ ఇవ్వకుండా ఒంటెద్దు పోకడపోతున్న ఎమ్మెల్యే తీరు నచ్చకనే బీఆర్ఎస్ నాయకులు కాంగ్రెస్ వైపు మొగ్గు చూపుతున్నారన్నారు. పార్టీ కార్యకర్తలను గుర్తుపట్టని ఎమ్మెల్యే నియోజకవర్గాన్ని ఎలా అభివృద్ధి చేస్తాడని ప్రశ్నించారు. పార్టీ కార్యక్రమాలకు తమకు సమాచారం ఇవ్వకుండా అవమానిస్తున్న ఎమ్మెల్యే వైఖరి నచ్చకనే బీఆర్ఎస్‌ని వీడి కాంగ్రెస్‌లో చేరినట్లు తెలిపారు.

పేదల సంక్షేమమే ప్రభుత్వ లక్ష్యం

డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి



న్యాయవాది అశోక్‌రెడ్డిని పార్టీలోకి ఆహ్వానిస్తున్న డీసీసీ అధ్యక్షుడు నర్సారెడ్డి

గజ్వేల్: పేదల సంక్షేమమే లక్ష్యంగా తమ ప్రభుత్వం ముందుకు సాగుతుందని డీసీసీ అధ్యక్షుడు తూంకుంట నర్సారెడ్డి అన్నారు. మంగళవారం గజ్వేల్‌లోని తన నివాసంలో బీఆర్ఎస్‌కు చెందిన న్యాయవాది అశోక్‌రెడ్డి, మాజీ సహకార సంఘం చైర్మన్ వెంకటనర్సింహారెడ్డి కాంగ్రెస్‌లో చేరారు. వారికి పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయడమే లక్ష్యంగా ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. నియంతృత్వ ధోరణిలో బీఆర్ఎస్ పాలన సాగిందని విమర్శించారు. కాగా పట్టణంలోని ఓ ప్రైవేటు ఫంక్షన్‌హాల్‌లో గజ్వేల్ అసెంబ్లీ నియోజకవర్గస్థాయి బూత్ కమిటీల సమావేశం జరిగింది. పార్టీ శ్రేణులకు మెదక్ ఎంపీ ఎన్నికలపై దిశానిర్దేశం చేశారు. కార్యక్రమంలో కాంగ్రెస్ గజ్వేల్ మండల పార్టీ అధ్యక్షుడు మల్లారెడ్డి, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మాజీ మున్సిపల్ చైర్మన్ గాడిపల్లి భాస్కర్ పాల్గొన్నారు.

సర్కార్ బడుల విజయకేతనం

- వంద శాతం ఉత్తీర్ణత
- 10 జీపీఏ సాధించిన విద్యార్థులు
- అభినందించిన విద్యాశాఖ అధికారులు



10 జీపీఏ సాధించిన భావ్యను అభినందిస్తున్న హుస్నాబాద్ మోడల్ స్కూల్ పాఠశాల ప్రిన్సిపాల్ అన్నపూర్ణ

హుస్నాబాద్: పదో తరగతి పరీక్ష ఫలితాలు మంగళవారం విడుదల చేశారు. సర్కార్ బడుల విద్యార్థులు అత్యుత్తమ ఫలితాలు సాధించి సత్తాచాటారు. మోడల్ స్కూల్, మైనార్టీ బాలికల రెసిడెన్సియల్ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. పట్టణంలోని మోడల్ స్కూల్ విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించగా, చొల్లేటి భావ్యశ్రీ 10 జీపీఏ సాధించింది. అలాగే తెలంగాణ మైనార్టీ బాలికల రెసిడెన్సియల్ పాఠశాల విద్యార్థులు వంద శాతం ఉత్తీర్ణత సాధించారు.

మిరుదొడ్డిలో మోడల్ స్కూల్

మిరుదొడ్డి(దుబ్బాక): పదో తరగతి వార్షిక పరీక్షా ఫలితాల్లో మిరుదొడ్డి మోడల్ స్కూల్ విద్యార్థులు ప్రతిభ చాటారు. మొత్తం 90 మంది విద్యార్థులు ఉత్తీర్ణత సాధించారు. డాకి చందన, సాయి శృతి 10 జీపీఏ సాధించారు. విద్యార్థులను ప్రిన్సిపాల్ భారతీదేవి అభినందించారు.

టీఎస్ బాలికల సంక్షేమ పాఠశాలలో..

బెజ్జంకి(సిద్దిపేట): మండలంలోని ప్రభుత్వ, ప్రైవేటు ఉన్నత పాఠశాలల విద్యార్థులు పదో తరగతిలో వంద శాతం ఉత్తీర్ణత సాధించారని ఎంఈఓ పావని మంగళవారం తెలిపారు. బెజ్జంకి టీఎస్ బాలికల సంక్షేమ పాఠశాలకు చెందిన జె.సౌమ్య, బి. వైష్ణవి, జి.సాత్విక, సత్యసాయి గురుకుల విద్యానికేతన్‌లో ఇద్దరు విద్యార్థులు 10 జీపీఏ సాధించినట్లు తెలిపారు.

గురుకుల పాఠశాలలో వంద శాతం

కోహెడ(హుస్నాబాద్): మండల కేంద్రంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాల, ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల విద్యార్థులు 10వ తరగతి ఫలితాలలో ప్రతిభ కనబర్చారు. ప్రభుత్వ సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలకు చెందిన డి.వివేక్ వర్ధన్, ప్రభుత్వ ఉన్నత పాఠశాలకు చెందిన బోనగిరి మేఘన, అంజనాదేవి 10 జీపీఏ సాధించారు. కాగా ప్రభుత్వ సాంఘీక సంక్షేమ గురుకుల పాఠశాల వంద శాతం, ప్రభుత్వ ఉన్నత పాఠశాల 98 శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఆయా పాఠశాల ఉపాధ్యాయులు చలపతి, మహమూద్ తెలిపారు.

మండలంలో వంద శాతం ఉత్తీర్ణత

నంగునూరు(సిద్దిపేట): పదో తరగతి ఫలితాల్లో నంగునూరు మండలం వంద శాతం ఉత్తీర్ణత సాధించింది. నర్మేట ఉన్నత పాఠశాలలో ఎనిమిది మంది, నంగునూరులో ఆరుగురు, అక్కెనపల్లి మోడల్ స్కూల్‌లో ముగ్గురు, మగ్దుంపూర్‌లో ఇద్దరు, పాలమాకుల, రాజగోపాల్‌పేట, గట్లమల్యాల, అంక్షాపూర్ ఉన్నత పాఠశాలలో ఒక్కొక్కరు 10 జీపీఏ సాధించారని ఇన్‌చార్జీ ఎంఈఓ యాదవరెడ్డి తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

సత్తాచాటిన ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు

దుబ్బాకటౌన్: పదో తరగతి ఫలితాల్లో దుబ్బాక మండల ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులు సత్తాచాటారు. 13 పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణ సాధించినట్లు మండల విద్యాధికారి ప్రభుదాస్ తెలిపారు. లచ్చపేట మోడల్ స్కూల్‌కు చెందిన తుమ్మ సృజన, కడుదూరి నందిని 10 జీపీఏ సాధించారు. మోడల్ స్కూల్ వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ప్రిన్సిపాల్ సుప్రియ తెలిపారు.

1021 మంది విద్యార్థులకు 973 మంది..

గజ్వేల్‌రూరల్: గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపాలిటీతోపాటు మండల పరిధిలోని ఆయా ప్రభుత్వ పాఠశాలలకు చెందిన విద్యార్థులు ఉత్తమ ఫలితాలను సాధించినట్లు మంగళవారం గజ్వేల్ ఎంఈఓ సునీత తెలిపారు. మండలంలో మొత్తం 21 ప్రభుత్వ పాఠశాలలుండగా 1021 మంది విద్యార్థులకు 973 మంది, 11 ప్రైవేటు పాఠశాలలుండగా 497 మందికి 497 మంది విద్యార్థులు ఉత్తీర్ణులైనట్లు చెప్పారు.

మండల టాపర్..

జగదేవ్‌పూర్(గజ్వేల్): పది ఫలితాల్లో మండలంలోని ఐదు ప్రభుత్వ, రెండు ప్రైవేట్ పాఠశాలలు వందశాతం ఉత్తీర్ణత సాధించాయి. మహాత్మ జ్యోతిబాపూలే బాలికల పాఠశాల విద్యార్థిని దార అర్చన 10 జీపీఏ సాధించి మండల టాపర్‌గా నిలిచింది. మండల వ్యాప్తంగా 575 మంది విద్యార్థులకు 526 మంది ఉత్తీర్ణులైనట్లు ఎంఈఓ తెలిపారు.

ఆరోసారి వందశాతం

వట్టిపల్లి జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల పది ఫలితాల్లో వరుసగా ఆరోసారి వందశాతం ఫలితాలతో రికార్డు సాధించింది. వరుసగా వంద శాతం సాధించడం పట్ల ఉపాధ్యాయ సంఘాలు, ఎంఈఓ ఉదయ్‌భాస్కర్‌రెడ్డి హర్షం వ్యక్తం చేశారు. ఫలితాలు రావడానికి కృషిచేసిన ఉపాధ్యాయులను ప్రత్యేకంగా భినందించారు.

మండలంలో 25 మందికి..

చిన్నకోడూరు(సిద్దిపేట): పదో తరగతి ఫలితాల్లో మండలంలోని 16 ఉన్నత పాఠశాలలు, మోడల్ స్కూల్, కేజీబీవీ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. చిన్నకోడూరు ఉన్నత పాఠశాలలో 10 మంది విద్యార్థులు 10 జీపీఏ సాధించారు. మండలంలో మొత్తం 25 మంది 10 జీపీఏ సాధించారు.

వంద శాతం ఉత్తీర్ణత..

అక్కన్నపేట(హుస్నాబాద్): మండలంలో తొమ్మిది ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు, కస్తూర్బా గాంధీ బాలికల విద్యాలయం పది ఫలితాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించారని మండల నోడల్ ఆఫీసర్ రంగానాయక్ మంగళవారం తెలిపారు. కేజీబీవీ విద్యాలయంలో మొత్తం 229 మంది విద్యార్థులకు గాను 229 మంది ఉత్తీర్ణత సాధించారని కేజీబీవీ ప్రత్యేకాధికారి సరిత చెప్పారు.

98.67 శాతం ఉత్తీర్ణత

సిద్దిపేటఅర్బన్: పది ఫలితాల్లో గురుకుల పాఠశాలల విద్యార్థులు సత్తా చాటారు. సిద్దిపేట అర్బన్ మండలంలో ప్రభుత్వ, గురుకుల పాఠశాలలు 22 ఉన్నాయి. 98.67 శాతం ఉత్తీర్ణత నమోదైంది. 16 పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. 14 మంది 10 జీపీఏ సాధించారు. ఎన్సాన్‌పల్లిలోని రెసిడెన్షియల్ కాలేజీ విద్యార్థులు గీతికరెడ్డి, లిఖిత, సహన, నీరజ, బ్యూలరాణి, పల్లవి, నంది, సాంఘిక సంక్షేమ గురుకుల బాలికల పాఠశాలకు చెందిన విద్యార్థిని 10 జీపీఏ సాధించారు.

99.65 శాతం ఉత్తీర్ణత

తొగుట(దుబ్బాక): పదో తరగతి ఫలితాల్లో మండలంలోని ఆరు జెడ్పీహెచ్ఎస్, సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాల, కేజీబీవీ 99.65 శాతం ఉత్తీర్ణత సాధించాయి. సాంఘిక సంక్షేమ బాలికల గురుకుల పాఠశాలకు చెందిన 14, కేజీబీవీకి చెందిన ఇద్దరు 10 జీపీఏ సాధించారు. ఫలితాలపై మండల విద్యాధికారి సత్తు యాదవరెడ్డి సంతోషం వ్యక్తంచేశారు.

99 శాతం ఉత్తీర్ణత

ములుగు(గజ్వేల్): పదో తరగతి ఫలితాల్లో మండలంలో 99 శాతం ఉత్తీర్ణతను సాధించినట్లు మండల విద్యాధికారి ఉదయ్‌బాస్కర్‌రెడ్డి తెలిపారు. కొట్యాల, ములుగు, ఆర్‌అండ్‌ఆర్ కాలనీ, తున్కిబొల్లారం జెడ్పీహెఎస్, ములుగు కేజీవీబీ, ములుగు సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాల్లో వందకు వంద శాతం ఉత్తీర్ణత పొందారన్నారు.

రెండు మండలాల్లో..

మద్దూరు(హుస్నాబాద్): మంగళవారం విడుదలైన పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మద్దూరు, దూల్మిట్ట మండలాల్లోని ప్రభుత్వ పాఠశాలలు వంద శాతం ఉత్తీర్ణత సాధించాయి. ఈ మండలాల్లోని 11 పాఠశాలల్లో ఏడుగురు 10 జీపీఏ సాధించారు.

విద్యార్థులకు అభినందనలు

కొండపాక(గజ్వేల్): పది ఫలితాల్లో ఉమ్మడి కొండపాక మండలంలోని ప్రభుత్వ హైస్కూల్‌కు చెందిన ఏడుగురు విద్యార్థులు 10 జీపీఏ సాధించారని ఎంఈఓ శ్రీనివాస్‌రెడ్డి పేర్కొన్నారు. 10 జీపీఏ సాధించిన విద్యార్థులను అభినందించారు. ఉమ్మడి కొండపాక మండలంలో కుకునూరుపల్లి హైస్కూకు చెందిన ఐదుగురు వి ద్యార్థులు 10 జీపీ ఏ సాధించడం పీఏన్ఆర్ ట్రస్టు నిర్వాహకుడు, మాజీ సర్పంచ్ జయంతి భర్త పొల్కంపల్లి నరేందర్ విద్యార్థులను అభినందించారు. త్వరలో ట్రస్టు తరపున ప్రోత్సాహక నగదు బహుమతి అందజేస్తామన్నారు. అలాగే 10 జీపీఏ సాధించిన కొండపాక హైస్కూల్ విద్యార్థిని వైష్ణవికి తెలంగాణ రాష్ట్ర జాగృతి అధ్యక్షుడు అనంతుల ప్రశాంత్ రూ.10 వేల నగదు అందజేసి అభినందించారు. మర్పడ్గ హైస్కూల్ విద్యార్థి ముబిన్‌ను విజయ దుర్గా సమేత సంతాన మల్లికార్జున స్వామి క్షేత్ర నిర్వాహకుడు హరినాథ శర్మ సన్మానించారు

రూరల్ మండలంలో 99. 31శాతం


సిద్దిపేటరూరల్: పదో తరగతి పరీక్షల్లో నారాయణరావుపేట, సిద్దిపేటరూరల్ మండలాల పరిధిలోని విద్యార్థులు ఉత్తమ ప్రతిభ కనబరిచారు. నారాయణరావుపేట మండల వ్యాప్తంగా వంద శాతం, రూరల్ మండల పరిధిలో 99.31 శాతం ఉత్తీర్ణత శాతం సాధించారు.

పన్నెండు పాఠశాలల్లో......

చేర్యాల(సిద్దిపేట): పదో తరగతి పరీక్ష ఫలితాల్లో మండల పరిధిలో ముస్త్యాల మోడల్ స్కూల్, పట్టణ కేంద్రంలో కేజీబీవీ, సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలతోపాటు మరో తొమ్మిది ప్రభుత్వ ఉన్నత పాఠశాల్లో వంద శాతం ఉత్తీర్ణత సాధించినట్లు ఏంఈఓ శ్రీనివాస్ రెడ్డి తెలిపారు. విద్యార్థులను అభినందించారు.

మూడు గ్రామాల్లో..

హుస్నాబాద్‌రూరల్: మండలంలోని ప్రభుత్వ ఉన్నత పాఠశాలలు మంగళవారం విడుదల చేసిన 10వ తరగతి ఫలితాల్లో వంద శాతం ఫలితాలను సాధించి ఆదర్శంగా నిలిచాయి. పోతారం(ఎస్), మహ్మదాపూర్, పొట్లపల్లి వందశాతం ఉత్తీర్ణత సాధించారు. మీర్జాపూర్ ప్రభుత్వ ఉన్నత పాఠశాలలో ఏడుగురు, గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో 24 మంది ఉత్తీర్ణులయ్యారు.



స్థానికుడిని ఎంపీగా గెలిపించాలి

బెజ్జంకి(సిద్దిపేట): స్థానికుడు వెలిచాల రాజేందర్ రావును కరీంనగర్ ఎంపీగా గెలిపించాలని మానకొండూర్ ఎమ్మెల్యే సత్యనారాయణ పిలుపునిచ్చారు. బెజ్జంకిలో మంగళవారం వివిధ గ్రామాలకు చెందిన పలువురు మాజీ సర్పంచ్‌లు ద్యావనపల్లి మంజుల, శ్రీనివాస్, లింగారెడ్డి, పద్మశాలి సంఘం అధ్యక్షుడు మచ్చ శేఖర్ తదితరులు కాంగ్రెస్ పార్టీలో చేరారు. వీరికి ఎమ్మెల్యే పార్టీ కండువా కప్పి పార్టీలోకి ఆహ్వానించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం ప్రజా సంక్షేమం, రాష్ట్ర అభివృద్ధికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ప్రజల్లో వస్తున్న స్పందన చూస్తే రాహుల్ గాంధీ ప్రధాన మంత్రి కావడం ఖాయమన్నారు. ప్రజల సమస్యలను పట్టించుకోని నాయకులకు ఎన్నికల్లో బుద్ధి చెప్పాలని కోరారు. కార్యక్రమంలో మాజీ ఎంపీపీ ఒగ్గు దామోదర్, మండల పార్టీ అధ్యక్షుడు రత్నాకర్‌రెడ్డి, పోచయ్య, నర్సయ్య, శ్రీనివాస్‌గౌడ్, పులి కృష్ణ, ప్రభాకర్ తదితరులు పాల్గొన్నారు.



కాంగ్రెస్‌లోకి ఆహ్వానిస్తున్న ఎమ్మెల్యే సత్యనారాయణ

ప్రగతికి పట్టం కట్టండి

గజ్వేల్‌రూరల్: దేశంలో అభివృద్ధి, సంక్షేమం కోసం బీజేపీ మెదక్ పార్లమెంట్ అభ్యర్థి రఘునందన్‌రావును గెలిపించాలని ఆ పార్టీ నాయకులు కోరారు. మండల పరిధిలోని కొడకండ్లలో మంగళవారం ఉపాధి హామీ పనులు చేస్తున్న కూలీల వద్దకు వెళ్లి రఘునందన్‌రావుకు మద్దతుగా ఎన్నికల ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. గ్రామస్థాయిలో జరిగిన ప్రతీ అభివృద్ధి పనిలో కేంద్ర ప్రభుత్వం నిధులు కేటాయించిందన్నారు. మాయమాటలతో మభ్యపెట్టేందుకు వస్తున్న పార్టీలకు ఓటుతో గుణపాఠం చెప్పాలన్నారు. కార్యక్రమంలో గజ్వేల్ అసెంబ్లీ కోకన్వీనర్ బండారు మహేష్, బీజేపీ మండల పార్టీ అధ్యక్షుడు పంజాల అశోక్‌గౌడ్, ప్రధాన కార్యదర్శి వెంకటేష్‌గౌడ్, ఉపాధ్యక్షుడు కుమార్, నాయకులు గాలయ్య, రవి పాల్గొన్నారు.

బీజేపీతోనే అభివృద్ధి..

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): అన్ని వర్గాల అభివృద్ధి బీజేపీతోనే సాధ్యమని ఆ పార్టీ సిద్దిపేట అసెంబ్లీ కన్వీనర్ ఉపేందర్‌రావు అన్నారు. మెదక్ పార్లమెంట్ నియోజకవర్గ బీజేపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా మంగళవారం సిద్దిపేటలో ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ప్రచరంలో పార్టీ పట్టణ అధ్యక్షుడు కోడూరి నరేష్, నాయకులు పాల్గొన్నారు.

అనంతసాగర్, రామునిపట్లలో ..

చిన్నకోడూరు(సిద్దిపేట): బీజేపీతోనే దేశ అభివృద్ధి సాధ్యమని ఆ పార్టీ జిల్లా అధికార ప్రతినిధి భూమేష్ గౌడ్ అన్నారు. మంగళవారం మండల పరిధిలోని అనంతసాగర్, రామునిపట్లలో మెదక్ ఎంపీ అభ్యర్థి రఘునందన్‌రావుకు మద్దతుగా ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రధాని నరేంద్ర మోదీ నాయకత్వాన్ని దేశ ప్రజలు కోరుకుంటున్నారన్నారు. బీజేపీ పాలనలోనే దేశం సురక్షితంగా ఉంటుందన్నారు.

టెన్త్ ఫలితాల్లో మెరీడియన్ సత్తా



విద్యార్థులను అభినందిస్తున్న మెరీడియన్ పాఠశాల యాజమాన్యం

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పదో తరగతి ఫలితాల్లో సిద్దిపేటకు చెందిన మెరీడియన్ పాఠశాల విద్యార్థులు మరోసారి సత్తాచాటారు. పరీక్షలు రాసిన అందరూ ఉత్తీర్ణత సాధించారు. 22 మంది 10 జీపీఏ సాధించారు. 21 మంది 9.8 జీపీఏ, 17 మంది 9.7, 10 మంది 9.5, 101 మంది పైగా విద్యార్థులు 9 జీపీఏ సాధించారు. విద్యార్థులను పాఠశాల యాజమాన్యం సన్మానించి, అభినందనలు తెలిపింది. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్స్ రాజేందర్ రెడ్డి, సౌజన్యలు మాట్లాడుతూ నిరంతర శ్రమ, సరైన ప్రణాళికలు, అనుభవజ్ఞులైన ఉపాధ్యాయుల వల్లే నూరుశాతం ఉత్తీర్ణత సాధ్యమైందన్నారు. దీంతో జిల్లాలో ఉత్తమ పాఠశాలగా నిలిచిందన్నారు. కార్యక్రమంలో పాఠశాల డైరెక్టర్లు దేవేందర్ రెడ్డి, రాజా వెంకటరెడ్డి, విద్యార్థుల తల్లిదండ్రులు, ఉపాధ్యాయులు పాల్గొన్నారు.

ఆ పార్టీలకు ఓటేసి కష్టాలు తెచ్చుకోవద్దు

బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేలేటి రోజాశర్మ

కొండపాక(గజ్వేల్): కాంగ్రెస్, బీజేపీలకు ఓట్లు వేసి మరిన్ని కష్టాలు తెచ్చుకోవద్దని బీఆర్ఎస్ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి వేలేటి రోజాశర్మ అన్నారు. మండలంలోని బందారం, రాంపల్లి గ్రామాల్లో మెదక్ పార్లమెంట్ బీఆర్ఎస్ అభ్యర్థి వెంకట్రామిరెడ్డికి మద్దతుగా మాజీ గ్రంథాలయ సంస్థ చైర్మన్ లక్కిరెడ్డి ప్రభాకర్‌రెడ్డి, తెలంగాణ జాగృతి రాష్ట్ర కార్యదర్శి అనంతుల ప్రశాంత్, మాజీ ఎంపీపీ బొద్దుల కనకయ్య, రైతుబంధు సమితి మండల మాజీ కోఆర్డినేటర్ ర్యాగల్ల దుర్గయ్య ఇంటింటి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా వారు మాట్లాడారు. కాంగ్రెస్ పార్టీ అధికారం కోసం ఆచరణకు సాధ్యం కాని హామీలిచ్చి ప్రజలను మోసం చేస్తోందన్నారు. రూ.2 లక్షల రుణమాఫీ, ధాన్యానికి రూ.500 బోనస్ ఇస్తామన్న మాటలు ఏమయ్యాయో ప్రజలు ఆలోచించాలన్నారు. ప్రజల బాగు కోసం వెంకట్రామిరెడ్డి రూ.100 కోట్లతో ట్రస్టును ఏర్పాటు చేసేందుకు సిద్ధంగా ఉన్నారన్నారు. ప్రచారంలో పార్టీ మండల అధ్యక్షుడు నూనె కుమార్, నాయకులు తదితరులు పాల్గొన్నారు.

సంక్షిప్త వార్తలు

◆ మే డే నిర్వహించండి

చేర్యాల(సిద్దిపేట): అంతర్జాతీయ కార్మిక దినోత్సవం మే డేను ఘనంగా నిర్వహించాలని ఏఐటీయూసీ కార్యవర్గ సభ్యుడు అందె అశోక్ పిలుపునిచ్చారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ దేశంలోని కార్మిక సంఘాల ఐక్యత, కార్మిక ఉద్యమాల విజయాలు, పని పరిస్థితుల మెరుగు కోసం మేడే జరుపుకోవాలన్నారు. ప్రపంచ వ్యాప్తంగా అనేక దేశాలలో కవాతులు, ర్యాలీలు, సభలు తదితర కార్యక్రమాలు నిర్వహిస్తాయని తెలిపారు. గ్రామాల్లో ఏఐటీయూసీ జెండాను ఎగురవేయాలన్నారు.

◆ బస్సు సర్వీస్‌లు పునరుద్ధరించండి

హుస్నాబాద్: హుస్నాబాద్ నుంచి హైదరాబాద్‌కు ప్రతీరోజు ఉదయం 5 గంటలకు వెళ్లే సూపర్ లగ్జరీ బస్సును పునరుద్ధరించాలని సీపీఐ నాయకులు మంగళవారం డిపో మేనేజర్ వెంకటేశ్వర్లకు వినతి పత్రం ఇచ్చారు. 25 రోజుల క్రితం రద్దు చేసిన బస్సులను ఎప్పటిలాగే నడపాలని, అలాగే అన్ని మండలాలు, మారుమూల గ్రామాలకు బస్సు సౌకర్యం కల్పించాలని కోరారు. కార్యక్రమంలో సీపీఐ రాష్ట్ర సమితి సభ్యుడు గడిపె మల్లేశ్, నాయకులు సంజీవరెడ్డి, రాజ్‌కుమార్, గూడ పద్మ, ఎల్లయ్య, కుమారస్వామి పాల్గొన్నారు.

◆ ఆ పార్టీలకు ఓట్లు అడిగే హక్కు లేదు

కొమురవెల్లి(సిద్దిపేట): బీజేపీ, కాంగ్రెస్, బీఆర్ఎస్, పార్టీలకు ప్రజలను ఓట్లు అడిగే నైతిక హక్కు లేదని సీపీఎం రాష్ట్ర కమిటీ సభ్యుడు అడివయ్య అన్నారు. మంగళవారం మండలంలోని అయినాపూర్‌లో భువనగిరి పార్లమెంట్ సీపీఎం అభ్యర్థి జహంగీర్‌కు మద్దతుగా ఇంటించి ప్రచారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఇప్పటి వరకు భువనగిరి నుంచి గెలిచిన అభ్యర్థులు నియోజకవర్గ అభివృద్ధికి కృషి చేయలేదన్నారు. భువనగిరి అభివృద్ధి కోసం సీపీఎం అభ్యర్థి జహంగీర్‌ను గెలిపించాలని విజ్ఞప్తి చేశారు. ప్రచారంలో పార్టీ మండల కార్యదర్శి శెట్టిపల్లి సత్తిరెడ్డి, తాడూరి రవీందర్, తెలు ఇస్తారి తదితరులు పాల్గొన్నారు.

◆ ఎంఏ ఎంట్రెన్స్ కోచింగ్ ప్రారంభం

గజ్వేల్‌రూరల్: గజ్వేల్ బాలికల ఎడ్యుకేషన్ హబ్‌లో గల ప్రభుత్వ మహిళా డిగ్రీ కళాశాలలో ఎంఏ ఎంట్రెన్స్ కోచింగ్ ప్రారంభించినట్లు ప్రిన్సిపాల్ డాక్టర్ పీవీ ఉమాశశి తెలిపారు. మంగళవారం ఆమె మాట్లాడుతూ విద్యార్థినులు డిగ్రీ చదువుతూనే ఉన్నత చదువులపై దృష్టి సారించాలన్నారు. ఎంఏ తెలుగు చదవడం వల్ల ఉద్యోగ అవకాశాలుంటాయని, ఎంట్రెన్స్‌లో మంచి ర్యాంకు సాధిస్తే యూనివర్సిటీలో సీటు లభిస్తుందన్నారు. కార్యక్రమంలో తెలుగు శాఖ అసిస్టెంట్ ప్రొఫెసర్ డాక్టర్ అనిత, అధ్యాపకులు, విద్యార్థినులు పాల్గొన్నారు.

◆ బ్రహ్మోత్సవాలకు ఆహ్వానం

గజ్వేల్: గజ్వేల్ పట్టణంలోని సీతారామ, ఉమామహేశ్వర ఆలయంలో మే 1 నుంచి ప్రారంభం కానున్న బ్రహ్మోత్సవాలకు హాజరుకావాలని ఎమ్మెల్యే హరీశ్‌రావుకు ఆలయ కమిటీ మంగళవారం ఆహ్వాన పత్రికను అందజేసింది. కార్యక్రమంలో మాజీ ఎఫ్‌డీసీ చైర్మన్ వంటేరు ప్రతాప్‌రెడ్డి, గజ్వేల్–ప్రజ్ఞాపూర్ మున్సిపల్ చైర్మన్ ఎన్సీ రాజమౌళి తదితరులు పాల్గొన్నారు.

◆ పురస్కారానికి 'ఆటా పాటా' ఎంపిక

ప్రశాంత్‌నగర్(సిద్దిపేట): పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వవిద్యాలయం 2022 సంవత్సరానికి ప్రకటించిన సాహితీ పురస్కారాలకు సిద్దిపేటకు చెందిన కథల తాతయ్య, జాతీయ సాహిత్య పరిషత్ అధ్యక్షుడు ఎన్నవెళ్లి రాజమౌళి రచించిన 'ఆటా పాటా' కథల సంపుటి ఎంపికైందని బాలసాహితీవేత్త ఉండ్రాళ్ల రాజేశం మంగళవారం తెలిపారు. బాలసాహిత్య విభాగంలో 'ఆటాపాటా' ఎంపికైనట్లు పేర్కొన్నారు. కవులు రాజమౌళిని అభినందించారు.

◆ ముందస్తు ఆస్తిపన్ను రూ.27 లక్షలు

చేర్యాల(సిద్దిపేట): చేర్యాల పురపాలక సంఘం ఆస్తి పన్నుల వసూళ్లపై 5 శాతం రాయితీ మంగళవారంతో ముగుస్తుందని కమిషనర్ నర్సయ్య తెలిపారు. 2023–24 ఆర్థిక సంవత్సరానికి ముందస్తు వసూళ్లు రూ.8 లక్షలకు, 2024–25 సంవత్సరానికి రూ.27 లక్షల వసూలు చేసి రశీదు అందజేశారు. కార్యక్రమంలో మున్సిపల్ సిబ్బంది కృష్ణ తదితరులు పాల్గొన్నారు.

◆ ముగిసిన బ్రహ్మోత్సవాలు

బెజ్జంకి(సిద్దిపేట): శ్రీలక్ష్మీనర్సింహస్వామి బ్రహ్మోత్సవాలు మంగళవారం ముగిశాయి. పక్షం రోజులుగా సాగుతున్న ఉత్సవాలు చక్రతీర్థంతో పూర్తయ్యాయి. స్వామివారి ఉత్సవమూర్తిని రథం ఊరేగిస్తూ బెజ్జంకిలోని పురాతన ఆలయానికి తీసుకెళ్లారు. మహిళలు మంగళహారతులతో స్వామివారికి స్వాగతం పలికారు. కార్యక్రమంలో ఈఓ పీవీ శర్మ, పూజారి మధుసూదనాచారి పాల్గొన్నారు.

◆ వేసవి శిక్షణ శిబిరం ఏర్పాటు

కొండపాక(గజ్వేల్): మండలంలోని దుద్దెడలో ఫుట్‌బాల్ వేసవి శిక్షణ శిబిరం నిర్వహిస్తున్న ఏఐఎఫ్ఎఫ్ కోచ్ ఎండీ అజార్ షరీఫ్ మంగళవారం తెలిపారు. మే 1 నుంచి 31వ తేదీ వరకు ఫుట్‌బాల్‌లో ప్రతీరోజు ఉదయం, సాయంత్రం శిక్షణ ఇస్తామన్నారు. శిక్షణను సద్వినియోగం చేసుకోవాలన్నారు.

సాక్షి
మీరు వివాహ, జన్మదిన, పదవీ విరమణ శుభాకాంక్షలు, శ్రద్ధాంజలి, వర్ధంతి, జయంతి, వ్యాపార, ఉద్యోగ ప్రకటనలు, నోటీసులు, బహిరంగ ప్రకటనలు మొదలగు అన్ని రకాల ప్రకటనలు సాక్షి దినపత్రిక కొరకు సంప్రదించండి.
యం. నాగరాజు-9010957373
రమేష్ - 9951952990